
# అది ఎప్పుడో పగిలిన అద్దం !

అందరూ అద్దంలో చూసుకోవాలనుకుంటారు. అందంగా ఉన్నవాళ్లూ చూసుకోవాలనుకుంటారు. అందంగా లేనివాళ్ళూ చూసుకోవాలనుకుంటారు. అంద విహీనులు మొదట్లో అద్దానికి దూరంగా ఉండాలనుకుంటారు కానీ, నెమ్మది నెమ్మదిగా అద్దానికి అలవాటుపడతారు. అద్దానికి అలవాటుపడటం అంటే తమ ముఖాలకు అలవాటు పడడమే.




అద్దం అబద్ధం చెప్పదు. నిన్ను నిన్నుగా చూపుతుంది. చందమామ అద్దంలో చూసుకున్నా అతని అందంతో పాటు మచ్చనూ చూపుతుంది. అందుకే స్వచ్ఛమైన మనసున్న వాళ్లను అతనిది (ఆమెది) అద్దంలాంటి మనసు అంటాం. మనసులు విరిగితే ముక్కలైన అద్దంలాగే అతుక్కోవడం కష్టమనీ అంటాం. అద్దంలా మనిషి ఉండడం సులభం కాదు. మెరుపు మెరిస్తే, వాన కురిస్తే, హరివిల్లు విరిస్తే..... అంతా తమ కోసం అనుకునే పసిపాపలు అద్దాల్లా ఉండగలరు. ఎదిగే కొద్దీ ఒదిగి ఉండడానికో, ఎదిరించి నిలవలేకో అద్దంలా ఉండే పరిస్థితికి మనిషి దూరం కావచ్చు. ధైర్యవంతుడు అద్దంలా ఉండగలడు. పిరికివాడు అద్దంలా ఉండలేడు. అంటే, స్వచ్ఛంగా అద్దంలా ఉండాలంటే ఆత్మస్థయిర్యం కావాలన్న మాట. పిరికితనం మనసు అద్దాన్ని మసకబారిస్తుందన్న మాట. నీ మాటను బట్టి నీ మనసు తెలుస్తుంది. లౌక్యం లేని మాట మల్లెపూవులా మెరుస్తుంది. చాకులా దూసుకెళ్తుంది. అదే సత్యం లేని మాట అయితే ముళ్లజెముడులా గుచ్చుకుంటుంది. ఆకులా వణుకుతుంది.

వాడు అద్దంలాంటి మనిషి అంటాం. అలాగే రాయలసీమ అద్దం లాంటిది. అక్కడ లౌక్యాలుండవు. మోసాలుండవు. వెన్నుపోట్లుండవు. పైకొకమాట లోపలొకమాట ఉండదు. పొద్దుట నీకు నమస్కారం పెట్టి, ఆ రాత్రే నిన్ను చంపెయ్యడం ఉండదు. అక్కడందరూ అలాగే ఉంటారనడం అతిశయోక్తి కాదని అనలేం. బ్రాహ్మణుల్లో కూడా మహానుభావులున్నట్టే అక్కడా ఉంటారు.

అక్కడంతా స్పష్టం. నువ్వేమిటో నీకు స్పష్టం. నేనేమిటో నాకు స్పష్టం. అలాగే నీ గురించి నాకు స్పష్టం. నా గురించి నీకు స్పష్టం. అందుకే అక్కడ నువ్వూ నేనూ అద్దాల్లాంటి మనుషులం. ఎప్పుడో ఏ సుబ్బయ్యో ఏ వెంకయ్యనో ఏ పొలం తగాదాలలోనో చంపేస్తే ఆ సుబ్బయ్యను వెంకయ్య సోదరుడో, కుమారుడో కక్ష కట్టి చంపే వరకూ నిద్రపోడు. ఆ తర్వాత వెంకయ్య సోదరుడినో, కుమారుడినో హతమార్చే వరకూ సుబ్బయ్య కుమారుడో, సోదరుడో నిద్రపోడు...

ఒకప్పుడు సకారణంగా మొదలైన కక్షలు ఆ తర్వాత అకారణంగా కూడా కొనసాగుతాయి. అందుకోసం ఎవరికి వారు తమ వర్గాలను పోషించుకుంటారు. తమ నాయకుల కోసం ప్రాణాలివ్వడానికైనా సిద్ధపడే అనుచరులుంటారు. తమ అనుచరులకేమన్నా జరిగితే ఆ నాయకులు తప్పక ఆదుకుంటారు. ఇతర ప్రాంతాల్లో లాగా అవసరానికి ఉపయోగించుకుని ఆ తరువాత కరివేపాకులా వదిలేసే తత్వం

అక్కడి నాయకులకుండదు. ఎప్పుడో ఒకప్పుడు ప్రత్యర్థుల చేతిలో తమ ప్రాణాలు పోయే అవకాశముందనే యదార్థం నాయకులూ, అనుచరులూ సదా గుర్తించుకుంటారు. తమ తమ అనుచరులకు ఆయా నాయకులు బీమా చేయిస్తారు. వాళ్ళ పాలసీల సొమ్ము క్రమం తప్పకుండా తామే కడతారు. కత్తిపోట్లక తుపాకీ తూటాలకో మందు పాతరలకో తమ అనుచరులు ప్రాణాలు కోల్పోతే వాళ్ల కుటుంబాల పోషణకు లక్షో రెండు లక్షలు తప్పక ఇస్తారు. బీమా సొమ్ము సరే. అనుచరుల్ని అంత ఆప్యాయంగా చూసుకోవడం వల్లే వాళ్లు తమ నాయకుల కోసం ప్రాణాలర్పించడానికి సిద్ధంగా ఉంటారు.

అనుచర గణాన్ని పెంచి పోషిస్తూ తమ వర్గాన్ని నిలుపుకోవడం కోసం నాయకులు లక్షలూ, కోట్లూ ఆర్జించక తప్పదు. అందుకోసం కాంట్రాక్టుల్లో, సక్రమ వ్యాపారాల్లో, అక్రమ వ్యాపారాల్లో చేయక తప్పదు. సంపాదించే డబ్బంతా తమ వర్గాల పోషణకే, తమ కక్షల రక్తపాతానికే ఖర్చయిపోతుంది. అందువల్లేనేమో, ఒకనాటి రత్నాలసీమ రాళ్లసీమగా మారిపోయింది.

కొందరి కక్షల కోసం ఎందరో బలవ్వక తప్పడం లేదు. హైదరాబాద్‌లో ఎమ్మెల్యే పరిటాల రవిని అంతం చెయ్యడం కోసం ఆయన ప్రత్యర్థులు పెట్టిన కారుబాంబుకు ఇరవై ఆరుగురు బలయిపోయారు. వీరిలో ఆ కక్షలకు సంబంధం లేని వాళ్ళే ఎక్కువ. ముప్ఫైమంది వరకూ గాయపడ్డారు.

వాన కోసం, నీళ్ల కోసం నిరంతరం దాహార్తితో వుండే రాయలసీమ నేల అక్కడి నాయకుల కక్షల రక్తంతో తడుస్తోంది. ఆ నేలతల్లి దాహం నీళ్లతో తప్ప రక్తంతో తీరదుగాక తీరదు. పరిటాల రవులూ, ఎస్.వి. రమణారెడ్లూ ఎప్పుడో పగిలిపోయిన అద్దాన్ని విసిరిపారెయ్యాలి. కార్పణ్యాలతో మసకబారిన మనసుల్ని శుభ్రం చేసుకుని, కొత్త అద్దాన్ని తీసుకోవాలి. కారుణ్యపు కొత్త అర్థాల్ని తెలియచెప్పుకోవాలి.

ఇది దురాశగా కన్పించవచ్చుకానీ, నిరాశకంటే దురాశ మేలే కదూ! రెండు పదాల్లోనూ ఒక్క అక్షరమే తేడా. ఆ తేడాను చెరిపేస్తే కరుణ కరిగి నీళ్లల్లా రాళ్ల సీమను ముంచెత్తదా?

అదిగో ..... కొత్త అద్దం నిరాశకంటే దురాశే మేలని కొత్త అర్థం చెబుతోంది....

21-11-97

వార్త దినపత్రిక